కథానిక

# కలం ఖరీదు

"వాహిని"

"ఇదేమిట్రోయి కొత్త పెన్ను పెట్టావు జేబులో?" అని పూర్ణయ్య వాసుదగ్గిరికొచ్చి జేబులోవున్న పెన్ని తీశాడు. అది అట్టే పాత బడని స్వాన్ పెన్ను. పరకాయించి చూసి "ఎక్కడిదిరా?" అన్నాడు.

వాసు ఏమీ చెప్పలేదు. పెన్ తీసుకుని "ఎక్కడిదైతే నీకెందుకు? అమ్మేస్తాను కొంటావా?" అన్నాడు.

"ఎంత?"

"మూడు రూపాయలు!"

"ఓహోహో! సెకెండ్ హేండు బోకు పెన్ ఒకటి పట్టుకుని మూడురూపాయల్ట!" అని పూర్ణయ్య వెళ్లి వాడిసీటులో కూచున్నాడు.

వాసు తన పెన్‌కి మూడు రూపాయలైనా రావని అనుకుంటున్నాడు. ఇంతట్లోనే రంగడు, కామేశం, సింహం మొదలైన వాళ్ళందరూ మూగి ఆ పెన్ని చూశారు. కాని ఎవరూ దాన్ని మూడు రూపాయలు పెట్టి కొనలేదు. కొంటామని చెప్పనూలేదు.

బడి వదిలాక పూర్ణయ్య రెండు రూపాయలకైనా అడుగుతాడేమోనని చూశాడు వాసు. కాని పూర్ణయ్య ఏమీఅనకండా వెళ్లిపోయాడు. వాసు నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇంతలో క్రిష్ణారావు కనిపించాడు. ఇతను చిన్నన్నయ్యతో చదువుకునేవాడు. కాని స్కూలు ఫైనల్లో పోవడంవల్ల ఇంకా హైస్కూలుకు వస్తున్నాడు, అతను మొదట పలకరించి, భుజంమీద చెయివేసి, ఆచేతిని జేబు దగ్గిరికి పోనిచ్చి, పెన్ తీసి "అబ్బో! స్వాన్ పెన్ తగిలించావే! ఎక్కడిదీ?" అన్నాడు.

వాసు జంకూ కొంకూ లేకుండా "మా నాన్న నాలుగు రూపాయలిచ్చి కొన్నాడు నిన్న!" అన్నాడు.

"బావుందోయి పెన్నూ! కొత్తదే ఇంకానూ! ఆయిదారు రూపాయలు చేస్తుంది!" అన్నాడు క్రిష్ణారావు. పెన్ జేబులో వుంచేసి "మీ అన్నయ్య కులాసాగా వున్నాడా?" అన్నాడు.

"ఊఁ–" అని ఇంకా ఆశతో నిలబడ్డాడు వాసు. క్రిష్ణారావు వెళ్లిపోయాడు.

అయిదారు రూపాయలు చేస్తుందన్నమాట పెన్ను! నయమే! పూర్ణయ్యగాడికి తెలిసింది కాదుగాని తెలిస్తే నిష్కారణంగా నష్టం వొచ్చును!—ఇవాళ ఎంతమంచి రోజన్నమాట! మంచిరోజు కాకపోతే కాలికి ముల్లు గుచ్చుకుందిగదా అని వంగితే పెన్ దొరకడమేమిటి? అది అయిదారు రూపాయలు చెయ్యడమేమిటి?

అయిదు రూపాయలు! – ఇంగ్లీషు బుక్కు రూపాయి తొమ్మిదణాలన్నర. తెలుగుబుక్కు రూపాయికానీ. ఇంకా మిగుల్తుంది! తెలివితక్కువగాని, తనకా రెండూ వున్నాయిగా!– పోనీ అవిగాకపోతే సైన్సుబుక్కు మరేదో కొనుక్కోవచ్చు! మరి నాన్న నెలాఖర్ని అవి కొంటానన్నారు! ఇప్పుడు ఈ డబ్బుపెట్టి కొనేస్తే మరి ఆయన కొనరే!–

అన్నిటికంటే ముందు ఆ పెన్ను అమ్మే విధానం చూడాలి. నాగమయ్య పెన్నుల బేరం బాగా ఎరుగును. వాడిదగ్గిరికి వెళ్తే?– మరి మధ్యాన్నం ఇంటికెళ్ళకపోతే అమ్మ కోప్పడదూ? కోప్పడితే కోప్పడుతుంది. మేష్టరు ఉండిపోమన్నాడంటే మాట్లాడదు.

వాసు తిన్నగా నాగమయ్య ఇంటికెళ్ళి వీధి గుమ్మంఎక్కి "నాగేశ్వర్రావ్!" అని కేక పెట్టాడు. లోపల్నించి వాడు పరుగెత్తుకొచ్చి "నువ్వట్రా? ఏం?" అన్నాడు.

వాసు సంజ్ఞ చేస్తూ గుమ్మం దిగాడు. వెనకాతలే నాగమయ్య వెళ్ళాడు. "చూసేవా యీ పెన్ను! దీన్నమ్మేయాలి" అన్నాడు.

"నాకేమిటిస్తావ్?" అంటూనే పెన్ అందుకున్నాడు నాగమయ్య. అటూ యిటూ తిప్పి, కేప్ విప్పి చూసి, "అబ్బ! మంచిదేరా!

స్వాన్ పెన్ను! ఎక్కడిదిరా నీకూ? నిజం చెప్పు!" అన్నాడు.

"ఎవర్తోనూ చెప్పవ్ కద!"

"అబ్బే!"

"ఒట్టేయ్"

"ఒట్టు. నీతోడు. సరస్వత్తోడు"

"—గడ్డిలో కాలికి ముల్లు గుచ్చుకుంది. వొంగితీస్తూంటే పక్కని నల్లగా కనబడ్డది. జిగజిగా మెరుస్తూంటే ఏమిటా అని తీసేను ఇది!"

"కొట్టేవురా ఛాన్సు! సరే అమ్మేద్దాంగాని, నాకు సగమిస్తావా?"

సగమా? అయ్యబాబోయి! తే, నా పెన్ను. నే పోతాను!"

"ఉండు. పోనీ ఎంతిస్తావ్?"

"అర్ధరూపాయిస్తాను"

"నాకలా పనికిరాదు. ఇన్నో వొంతిస్తానూ అని నిక్కచ్చిగా చెప్పు!"

"అంటే?"

"నీకు మూడురూపాయలొస్తే నా కొకటిస్తావా? ఆ లెక్కని ఆరు రూపాయలొస్తే నాకు రెండు. నాలుగున్నరొస్తేరూపాయిన్నర!"

"అయ్యబాబో!"

"అయితే పట్టుకుపో. ఇదిగో నీ పెన్ను"

"— ఉండుండు. నాలుగో వొంతిస్తాను, అమ్మి పెడతావా?"

"ఉత్తి నాలుగోవొంతు చాలదు. నాలుగో వొంతిచ్చేసి ఓమాటు సినిమాకి తీసికెళ్లు."

"సరేగాని పెన్ను ఎంత ఎక్కువకయితే అంత యెక్కువ కమ్మాలి"

"నాకు తెలీదుట్రా? తే. పెన్నిచ్చేసి నువు పో!"

"ఆ ఆ! పాపం! నేనూ నీతో వొస్తాను!"

నాగమయ్య పుస్తకాలు పట్టుకొని వచ్చేశాడు. ఇద్దరూ కలిసి విశ్వనాథం పంతులు గారింటి కెళ్ళారు.

నాగమయ్య తలుపుకొట్టి "విశ్వనాథం గారున్నారండీ?" అన్నాడు.

"ఎవర్రా అదీ?" అని ఆయన వచ్చాడు.

"ఆ మధ్య మీరు పెన్ను కావాలన్నారు గదండీ! పట్టుకొచ్చేను. స్వాన్ పెన్నండీ! మీ అదృష్టం కొద్దీ ఈ అబ్బాయికి డబ్బవసరం వొచ్చింది" అన్నాడు నాగమయ్య.

వాసు ఆశ్చర్యంగా చూశాడు.

"ఈ కుర్రాడెవరు?" అంటూ పెన్ తీసుకొని చూస్తున్నారు విశ్వనాథం.

"ఇతనాండీ? మా క్లాస్ మేట్ వాసుదేవరావు. చూడ్డందేనికండీ! ఫస్టుక్లాసయిన పెన్"

"ఎంతకిస్తావ్?

"అడగండి"

"కాదు నువ్వు చెప్పు!"

"ఆరు రూపాయలడిగాలంటీ అతను!"

"పట్టుకెళ్లు పట్టుకెళ్లు ఆర్రూపాయల్ట! మరో రూపాయిన్నరిస్తే కొత్తరత్నం పెనొస్తుంది!"

"పోనీ అలాగే కొనుక్కోండి."

"పోనీ ఆయన కెంతకావాలో కనుక్కోరా!"

"రెండ్రూపాయలిస్తాను."

"హుఁ. కోరివొస్తే ఏదేనా యింతే! లేకపోతే దుక్కలాటి స్వాన్ పెన్నుని పట్టుకుని రెండ్రూపాయ లిస్తాననడానికి గుండే?" అన్నాడు నాగమయ్య.

"పోనీ పట్టుకుపో" అని ఆయన తలుపు వేసుకున్నాడు.

వాసు ఆశ్చర్యపడుతున్నాడు. నాగమయ్యకి ఎవళ్ళతో ఎలా మాటాడాలో తెలుసు! అదేగాని తను మాటాడితే వేషం వేసినట్టుంటుంది. అసలు తను అంత ధైర్యంగా మాట్లాడగలడా?

"ఒరేయి వాసూ! మనం విసుగులేకుండా నలుగురిదగ్గరికీ తిరగాలి. ఎవడెక్కువిస్తానంటే వాడికే అమ్మాలి తెలిసిందా?" అన్నాడు నాగమయ్య నడుస్తూ.

"అలాగే."

ఇద్దరూ కలిసి స్కూల్కొచ్చేరు. ఫిఫ్తుఫారం 'ఏ'రూములో ఒకాయన కూచున్నాడు. అతను మేష్టరుకాదని తెలియగానే నాగమయ్య ఆ గదిలోకి వాసుని రమ్మన్నాడు. దార్లో కొంత శిక్షణ చేశాడు.

"అసలు మీ అన్నయ్య యెంత కమ్మమన్నాడు?"

"ఆర్రూపాయలు చెప్పమన్నాడు. ఐదు రూపాయలకి తక్కువివ్వొద్దన్నాడు."

ఆ పెద్దమనిషి వల్లో పడ్డాడు.

"ఏమిటబ్బాయి?"

"పెన్నండీ-వీళ్ళన్నయ్యకి డబ్బు కావాల్ట, పెన్ను మ్మేస్తున్నాడు."

"ఏదీ చూదాం!"

వాసు పెన్నును ఆయనకిచ్చాడు.

"ఎంత?"

"ఆర్రూపాయలు."

"ఎక్కడో కొట్టుకొచ్చిన సరుకులా వుందే!"

నాగమయ్య జాగ్రత్తగా పెన్ తీసుకుని సీరియస్‌గా "ఏమండీ! మీరుకొంటే కొన్నారు లేకపోతే మా కేరుగాని మాటలు మాత్రం జాగ్రత్తగా రానియ్యండి!" అని "పదరా వాసూ! ఇదేదో నక్క బాపతులా వుంది!" అన్నాడు దారితీస్తూ. ఇవతలికొచ్చి నవ్వటం మొదలెట్టాడు!

అప్పటికప్పుడే విద్యార్థులు స్కూలుకి వస్తున్నారు. నాగమయ్య నలుగుర్లోనూ పెట్టాడు పెన్నుని. అతను కొస్త గట్టిగా అరుస్తున్నప్పుడు పక్కని నించోడానికి వాసు చాలా సిగ్గుపడ్డాడు. "ఒరే, అలా అరవకురా!" అన్నాడు. "ఉండెహె! నీకేం తెలీదు!" అని నాగమయ్య కసిరాడు.

కాని అందర్లోనూ రెండున్నర కెక్కువిస్తావని ఒక్కడూ అనలేదు. నాగమయ్య పెన్ వెనక్కిచ్చి, "ఒరే, బడి వొదిలేక చూద్దాం రా!" అన్నాడు.

బడి వదిలేక మళ్ళీ నాగమయ్య చాలా మందితో బేరంచేశాడు. ఒక కుర్రాడు నాలుగున్నరిస్తాను, రేపు రమ్మన్నాడు. అయితే నాలుగన్నరా రేపేపట్రా, పెన్ రేపే యిస్తాం అన్నాడు నాగమయ్య.

వాసు తృప్తితో ఇల్లుచేరాడు. వచ్చే మూడు రూపాయల్తో ఏమేం చెయ్యాలా అని చూస్తున్నాడు.

మర్నాడు తెల్లవారేచి పళ్లు తోముకుని కాఫీకి వంటింట్లో కెళ్ళేసరికి చిన్నన్నయ్య "ఎక్కడిదిరా నీకా పెన్నూ?" అని అడిగాడు.

వాసు ఏడుపుమొహంతో "ఆఁ. నా పెన్నిచ్చెయ్! నాకుదొరికింది!" అన్నాడు.

పెద్దన్నయ్య నవ్వుతూ "అప్పుడే యేడుపెందుకురా? ఇచ్చేస్తాంలే!" అన్నాడు.

"ఊఁ, యిస్తావు రమ్మని! పెట్లో పెట్టి దాచేసుకునుంటూ వప్పుడేను? తిట్టేస్తాను. నా పెన్నెవడు తీస్తేవాడు..."

అమ్మ కోపడ్డది. "బావుందిరా! నీ పెన్ను వాళ్లెందుకు తీసుకుంటారేమిటి? రాత్రి ఎందుకో వెతికేడు, నీ గూట్లో పెన్ను దొరికితే తీసి చూసేడు. ఇచ్చేస్తాడులే."

"అలా అయితే ఇప్పుడిచ్చేయమను."

చిన్నన్నయ్య అన్నాడు. "అది కాదే అమ్మా. అన్నయ్య రికార్డు రాసుకుందికి ఆ పెన్ను చాలా బావుంది: ఉంచేసుకున్నాడే!"

వాసు ఏడుపు ఖాయం చేశాడు.

"ఇస్, అబ్బ! వాడు తీసుకోడ్రా, యిచ్చేస్తాడ్రా! ఒరే నాయనా ఇచ్చేస్తూ, వాడిపెన్ను. ఇప్పుడా యేడుపేమిటి, పొద్దున్నేను!" అంది అమ్మ. అయినా వాసు ఊరుకోలేదు.

నాన్న వచ్చేరు "ఏమిరా, తెల్లారిందీ, నీ కేరక్టరు అప్పజెప్తున్నావ్!" అన్నారు.

అన్నయ్యలూ అక్కయ్యా నవ్వారు.

"ఎందుకురా ఏడుస్తాడు?"

"నిన్న వాడికెక్కడో స్వాన్ పెన్ దొరికిందట నాన్నా! రాత్రి అన్నయ్య రికార్డు రాసుకుందికి ఆ పెన్ తీసుకున్నాడు" అన్నాడు చిన్నన్నయ్య.

"అవును, నీకెందుకురా అంత విలువైన పెన్నూ?" అన్నారు నాన్న.

వాసు ఏడుస్తున్నాను సుమా అన్నట్టు మాటాడలేదు.

"వాడికి రాసుకోడానికి పెన్నుందా?"

"ఉంది."

"అయితే మరెందుకురా, వెధవ యేడుపు, నాలుగు తగల్నిచ్చేవాడు లేక!-ఆ పెన్ను ఉంచేసుకోరా!" అన్నారు నాన్న పెద్దన్నయ్యతో.

వాసు ఏడుపు నెవరూ లక్ష్యపెట్ట లేదు. లక్ష్యపెట్టినా "వెధవ పెంకితనం!" అని దెబ్బలాడేరే గాని సాయం చెయ్యలేదు.

బడికి పోయేటప్పుడు పెద్దన్నయ్య వాసుకి ఓ పావలా యిచ్చి "ఏదేనా కొనుక్కోరా!" అన్నాడు. వాసు ఏడవ్వాలా నవ్వాలా?